క్లుప్తంగా

పంట వివరాల నమోదు తప్పనిసరి

ఆమనగల్లు: పండించిన పంట వివరాలను రైతులు నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్‌గౌడ్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సెప్టెంబర్ 1 నుంచి ఏఈఓలు ఆయా గ్రామాల వారీగా పంట పొలాలను సందర్శించి, వివరాలను నమోదు చేస్తారని పేర్కొన్నారు. అన్నదాతలు సహకరించాలని సూచించారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

కడ్తాల్: భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామ్మోహన్‌రావు డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నిర్మాణ కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ద్వారా బీమా తదితర సౌకర్యాలు కల్పిస్తూ.. బోర్డు నిధులను ప్రభుత్వం పక్కదారి పట్టించాలని చూస్తోందని ఆరోపించారు. శ్రామికులు చట్టాలను తెలుసుకొని హక్కుల కోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. పోరాడి సాధించుకున్న బోర్డును రక్షించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల అధ్యక్షుడు పెంటయ్య, సంఘం మండల అధ్యక్షుడు మహేశ్, పెయింటర్ సంఘం అధ్యక్షుడు సత్యం, కార్యదర్శి రాములు, కేకే నర్సింహ, కోశాధికారి మల్లేశ్, బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు.

మన్‌కీ బాత్ వీక్షించిన కమలనాథులు



ప్రధాని కార్యక్రమాన్ని వీక్షిస్తున్న బీజేపీ శ్రేణులు

ఆమనగల్లు: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని ఆదివారం పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో ఆ పార్టీ శ్రేణులు వీక్షించారు. ఇందులో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు హరిప్రసాద్, మండల అధ్యక్షుడు శ్రీనివాస్, మున్సిపాలిటీ అధ్యక్షుడు విక్రంరెడ్డి, నాయకులు నర్సింహ, లక్ష్మణ్, చెన్నకేశవులు, ఆనంద్, మల్లేశ్, పరమేశ్‌గౌడ్ ఉన్నారు.

పోలీసు పహారాలో యూరియా పంపిణీ



పీఏసీఎస్ కేంద్రం వద్ద రైతులు, అధికారులు

కందుకూరు: మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయం వద్ద ఆదివారం సీఐ సీతారామ్, ఏఓ లావణ్య ఆధ్వర్యంలో యూరియా పంపిణీ కొనసాగింది. 450 బస్తాలు అందుబాటులో ఉండగా.. ముందుగా జారీ చేసిన టోకెన్ల వారీగా ఒక్కో రైతుకు రెండు బస్తాల చొప్పున యూరియా పంపిణీ చేశారు. సోమ, మంగళ వారాల్లో యూరియా రానుందని, మిగిలిన రైతులకు వచ్చిన వెంటనే పంపిణీ చేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఎవరూ ఆందోళన చెందొద్దని సూచించారు.

ఐక్యతతోనే హక్కులు సాధ్యం



జెండా ఆవిష్కరించిన సంఘం నాయకులు

షాద్‌నగర్: ముదిరాజ్‌లు ఐక్యతతో ముందుకు సాగాలని, తద్వారా తమ హక్కులను సాధించుకోవచ్చని ఆ సంఘం రాష్ట్ర నాయకుడు అందె బాబయ్య అన్నారు. ఆదివారం ఫరూఖ్‌నగర్ మండలం రాయికల్‌లో గ్రామ కమిటీ ఆధ్వర్యంలో ముదిరాజ్ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బాబయ్య హాజరై మాట్లాడుతూ.. ముదిరాజ్‌లు సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో రాణించాలని సూచించారు. ముదిరాజ్‌ల సంక్షేమానికి పాలకులు తగిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ముదిరాజ్‌లు అందరూ ఐక్యతతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘం తాలుకా గౌరవ అధ్యక్షులు చెట్ల జంగయ్య, అంచరాములు, అందె పైలయ్య, తాలుకా యువ అధ్యక్షుడు శ్రీధర్ వర్మ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అవినీతి మయం.. సహాయక సంఘం



యాచారం ఐకేపీ కార్యాలయంలో ఇటీవల రోహిణి సభ్యులను విచారిస్తున్న అధికారులు డీపీఎంలు యాదయ్య, లీలాకుమారి

అతివల ఆర్థికాభివృద్ధికి ఏర్పాటు చేసిన స్వయం సహాయక సంఘాలు అవినీతికి చిరునామాగా మారుతున్నాయి. సభ్యుల ప్రమేయం లేకుండా అధికారుల కుట్ర!, పర్యవేక్షించాల్సిన ఐకేపీ సీసీ, ఏపీఎంల నిర్లక్ష్యం వెరసి భారీగా నిధులు గోల్‌మాల్ అవుతున్నాయి. తొవ్విన కొద్దీ అవినీతి బాగోతం వెలుగు చూస్తోంది. ఇందుకు నిదర్శనం చౌదర్‌పల్లి రోహిణి సంఘం.

వెలుగుచూస్తున్న విస్తుగొలిపే అక్రమాలు
- చౌదర్‌పల్లి డ్వాక్రా నిధులపై కొనసాగుతున్న విచారణ
- ఒక్కో సంఘంలో బినామీల పేరిట రూ.15 లక్షలు స్వాహా
- 20 సంఘాల్లో రూ.కోటిన్నర జమ!
- బినామీలకు నోటీసులు జారీ

యాచారం: చౌదర్‌పల్లి గ్రామంలో 2015కు ముందు కొందరు మహిళలు రోహిణి స్వయం సహాయక సంఘాన్ని ఏర్పాటు చేశారు. అందులో నిధుల అక్రమాలు చోటుచేసుకోవడంతో ఆ సభ్యులు.. 2018లో సంఘాన్ని రద్దు చేశారు. ఇంత వరకు బాగానే ఉన్నా.. మూత పడిన తరువాత కూడా భారీ గోల్‌మాల్ బయటపడింది. దీంతో ఆ సభ్యులు.. సంఘం ఖాతాకు సంబంధించి ఎస్‌బీఐలో స్టేట్‌మెంట్ తీసుకోగా.. విస్తుపోయే విషయాలు వెలుగు చూశాయి. సంఘం పేరిట 2022లో రూ.15 లక్షల రుణం తీసుకున్నారని, అదీ సంఘంలో సభ్యులుగా లేని జయమ్మ, స్వాతి తదితరుల పేర్లపై బదిలీ అయినట్లు స్టేట్‌మెంట్‌లో ఉండటం గమనార్హం.

కొరవడిన పర్యవేక్షణ

అధికారుల పరిశీలనలో 20 సంఘాల్లోనే దాదాపు రూ.కోటి నుంచి రూ.కోటిన్నరకు పైగా అక్రమాలు జరిగినట్లు వెల్లడైంది. యాచారం ఎస్‌బీఐ నుంచి లక్షలాది రూపాయల రుణాలు సంఘాల ఖాతాల్లో బదిలీ అయిన నేపథ్యంలో.. మహిళలకు వడ్డీల భారం గుదిబండగా మారింది. ఈ తతంగమంతా ఇక్కడి నుంచి బదిలీ అయిన ఎస్‌బీఐ యాచారం మేనేజర్ ఝాన్సీరాణి సహకారంతోనే.. వీబీకే వరలక్ష్మి గ్రామంలోని పలువురి మహిళల ఖాతాల్లో రూ.లక్షలు జమచేసి, ఆ తర్వాత వారి నుంచి తీసుకున్నట్లు కొందరు ఫిర్యాదు చేస్తున్నారు. సహాయక సంఘాలు, పొదుపు, స్త్రీనిధి ఖాతాల్లో రూ.15 లక్షలు 2022లో రుణాలు ఇచ్చినట్లు బ్యాంకు స్టేట్‌మెంట్లలో ఉన్నప్పటికీ.. పర్యవేక్షించాల్సిన ఐకేపీ సీసీ, ఏపీఎంలు నిర్లక్ష్యంగా వ్యవహరించారన్న ఆరోపణలు వస్తున్నాయి.

రంగంలోకి ఎస్‌బీఐ ఏజీఎం

సంఘాల్లో జరిగిన అవినీతి అక్రమాలపై ఎస్‌బీఐ ఏజీఎం రామకష్టయ్య విచారణ చేపట్టారు. ఈ విచారణలో సంఘాల్లోని మహిళల పేరిట యాచారం ఎస్‌బీఐ నుంచి నిధులు బదిలీ అయినట్లు గుర్తించారు. వారందరికీ రికవరీ నోటీసులు జారీ చేయనున్నారు. దీంతో నిధుల గోల్‌మాల్, బినామీల పేరిట డబ్బు ఎలా బదిలీ అయింది? బ్యాంకు నుంచి పొరపాటున వారి ఖాతాల్లోకి వెళ్లాయా? లేక బ్యాంకు మేనేజర్, వీబీకేలు కుట్ర చేశారా? అనే వివరాలు తెలియనున్నాయని ఎస్‌బీఐ ఉన్నతాధికారులు భావిస్తున్నారు. సంఘాల పేరిట రుణాలు ఉన్నప్పటికీ.. ఆ సంఘాల మహిళలకు ఆ డబ్బు చేరలేదు. కానీ ఆ సంఘాలపై అప్పు మిగిలే ఉంది. వాటిని చెల్లించే స్తోమత ఆ సభ్యులకు లేదు. కాబట్టి బినామీలకు నోటీసులు జారీ చేస్తే.. అసలు గుట్టు వెలుగులోకి వస్తుందని, రికవరీకి పోలీసుల సహకారం కోరే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు.

“ సంఘాన్ని రద్దు చేశాం



నిధుల అక్రమాలతో రోహిణి స్వయం సహాయక సంఘాన్ని రద్దు చేశాం. 2018లో రద్దు చేస్తే మాకు ఎలాంటి సమాచారం లేకుండా 2022లో రూ.15 లక్షల రుణం తీసుకున్నట్లు బ్యాంకు స్టేట్‌మెంటులో ఉంది. ఇప్పుడు ఏం చేయాలో తోచడం లేదు. సంఘం పేరిట ఎవరు డబ్బులు పొందారో.. వారి నుంచే రికవరీ చేయాలి.
– గొరిగే చెన్నమ్మ, సంఘం సభ్యురాలు, చౌదర్‌పల్లి

రికవరీకి నోటీసుల జారీ



స్వయం సహాయక సంఘాల్లో జరిగిన అక్రమాలపై బ్యాంకు ఉన్నతాధికారులు సీరియస్‌గా ఉన్నారు. సంఘంలోని అధ్యక్ష, కార్యదర్శులకు సమాచారం లేకుండా.. నిధులు బదిలీ అయ్యాయి. ఎవరికి చెందాయో వారికి నోటీసులు జారీ చేస్తాం. వారు వడ్డీతో సహా చెల్లించాలి. లేదంటే పోలీసుల సహకారం తీసుకుంటాం.
– మాన్యనాయక్, ఎస్‌బీఐ మేనేజర్, యాచారం

సంబంధం లేని వారి పేరిట..



బ్యాంకు స్టేట్‌మెంట్లు, రుణాల రికార్డులను తనిఖీ చేస్తున్న ఆడిటర్లు శ్రీనివాస్, మధు

అవినీతి బాగోతం గ్రామంలోని ఒక్క రోహిణి సంఘంలోనే కాదు వీబీకే వరలక్ష్మి పర్యవేక్షిస్తున్న 25 డ్వాక్రా సంఘాల్లో చోటుచేసుకున్నట్లు రికార్డుల పరిశీలనలో బయటపడింది. డీఆర్‌డీఓ శ్రీలత ఆదేశాల మేరకు కొద్ది రోజులుగా డీపీఎంలు యాదయ్య, లీలాకుమారి, ఆడిటర్లు శ్రీనివాస్, మధులు యాచారం ఐకేపీ కార్యాలయంలో చౌదర్‌పల్లి సంఘాల దస్త్రాలను బ్యాంకు స్టేట్‌మెంట్ల ఆధారంగా పరిశీలిస్తున్నారు. ఈ పరిశీలనలో ఒక్కో సంఘం నుంచి రూ.10 నుంచి రూ.15 లక్షలు సంఘంతో సంబంధం లేని వారి పేరిట బదిలీ అయినట్లు అధికారులు గుర్తించారు.

రాహుల్‌గాంధీ క్షమాపణ చెప్పాలి



ఆమనగల్లు: రాహుల్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

ఆమనగల్లు: ప్రధానమంత్రి నరేంద్రమోదీ తల్లిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన రాహుల్‌గాంధీ.. వెంటనే దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు హరిప్రసాద్ డిమాండ్ చేశారు. రాహుల్ వ్యాఖ్యలకు నిరసనగా.. ఆ పార్టీ శ్రేణులు ఆదివారం పట్టణంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు. రాహుల్ దిష్టిబొమ్మను దహనం చేశారు. బీజేపీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, మున్సిపాలిటీ అధ్యక్షుడు విక్రంరెడ్డి, మాజీ అధ్యక్షుడు శ్రీకాంత్‌సింగ్, మాజీ కౌన్సిలర్లు లక్ష్మణ్, నర్సింహ, చెన్నకేశవులు, కృష్ణయాదవ్, నాయకులు రవిరాథోడ్, ప్రశాంత్, శ్రీనివాస్ పాల్గొన్నారు. కాగా.. మాడ్గుల, తలకొండపల్లిలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు నిరసనలు వ్యక్తం చేశారు.

కడ్తాల్‌లో..



కడ్తాల్‌లో..

కడ్తాల్: బీహార్ ఎన్నికల ప్రచారంలో ప్రధాని నరేంద్రమోదీ తల్లిపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని నిరసిస్తూ.. బీజేపీ శ్రేణులు ఆదివారం మండల కేంద్రంలో రాహుల్ దిష్టిబొమ్మను దహనం చేశారు. రాహుల్ వెంటనే తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని, క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. బీజేపీ దళిత మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు యాదగిరి, ఎస్టీమోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు లక్ష్మణ్, మండల ప్రధాన కార్యదర్శి విక్రాంత్‌చారి, గిరిజన మోర్చా మండల అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ ఉన్నారు.

బీసీలకు రిజర్వేషన్లు కేటాయించాలి

బీసీసేన జాతీయ అధ్యక్షుడు కృష్ణ



సభ్యులకు నియామకపత్రం అందజేస్తున్న కృష్ణ

షాబాద్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కేటాయించాలని బీసీసేన జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని పోతుగల్, సీతారాంపూర్ గ్రామాల్లో నూతన కమిటీ సీతారాంపూర్ అధ్యక్షుడిగా యాదయ్య, ఉపాధ్యక్షుడిగా బాలకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా పాండు, యువజన అధ్యక్షుడిగా రమేశ్, పోతుగల్ గ్రామ అధ్యక్షుడిగా వీరంపల్లి యాదయ్య, ఉపాధ్యక్షుడిగా మురళీగౌడ్, ప్రధాన కార్యదర్శిగా ఒగ్గు నవీన్, యువజన అధ్యక్షుడిగా కావలి అరవింద్, ఉపాధ్యక్షుడిగా కుమ్మరి నవీన్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీసీల హక్కుల కోసం నిరంతర పోరాటం చేస్తామని, జనాభాలో అత్యధికంగా ఉన్న బీసీలకు అన్ని విధాలా అన్యాయం జరుగుతుందన్నారు. బీసీలకు స్థనిక సంస్థలలో 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. బీసీలందరూ రాజకీయంగా ఆర్థికంగా అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని సూచించారు. పార్లమెంట్‌లో బీసీ బిల్లు ప్రవేశపెట్టాలని కోరారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలందరూ పోటీకి సిద్ధంగా ఉండాలని చెప్పారు. బీసీల హక్కుల సాధనకు తాము నిరంతరం పోరాటం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో బీసీ సేన మండల అధ్యక్షులు దయాకరచారి, ఉపాధ్యక్షులు మీరంపల్లి అజయ్‌కుమార్, నాయకులు మహేందర్, శ్రీశైలం, శివ, అబ్బాస్, మాజీ సర్పంచ్ సురేష్‌గౌడ్, మాజీ ఉపసర్పంచ్ సందీప్, రాములు, చారి, బాలకృష్ణ, పాండు, శ్రీనివాస్ ముదిరాజ్, సురేష్, జగన్, వెంకటయ్య, రాజుగౌడ్, మల్లేష్, పోచయ్య, వెంకటేష్, జైపాల్, కృష్ణ, శ్రీశైలం, ఆనంద్, తదితరులున్నారు.

కురుమ సంఘం ఆధ్వర్యంలో బారికేడ్లు

కందుకూరు: కురుమ సంఘం టౌన్ అధ్యక్షుడు పాముల శ్రీశైలం, ఎగ్గిడి రాజు ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ వద్ద ఏర్పాటు చేయడానికి బారికేడ్లను తయారు చేయించారు. ఆదివారం వాటిని.. సీఐ సీతారామ్‌తో పాటు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వస్పరి శంకర్, జిల్లా అధ్యక్షుడు సిద్దుల దశరథ, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి ఎగ్గిడి సత్తయ్య, మండల అధ్యక్షుడు అచ్చన పాండు తదితరుల చేతుల మీదుగా ప్రారంభించారు.

రేషన్ డీలర్ మండల అధ్యక్షుడిగా భానుచందర్



ఇబ్రహీంపట్నం రూరల్: రేషన్‌డీలర్ల అసోసియేషన్ మండల అధ్యక్షుడిగా కొంగరకలాన్‌కు చెందిన ఎలుగని భానుచందర్‌గౌడ్ ఎన్నికయ్యారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన ప్రత్యక్ష ఎన్నికల్లో 37 మంది డీలర్లు పాల్గొనగా.. మూడోసారి భానును ఎన్నుకున్నారు. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పి.శంకర్, ప్రధాన కార్యదర్శిగా సయ్యద్ అజీమ్, ఉపాధ్యక్షురాలిగా సునీత, కోశాధికారిగా విజయలక్ష్మి, కార్యదర్శిగా జ్యోతి, కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

నూతన కమిటీ ఎన్నిక

ఇబ్రహీంపట్నం: అంగన్‌వాడీ యూనియన్(సీఐటీయూ అనుబంధం) ఇబ్రహీంపట్నం సెక్టార్ నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా బాలమణి, కార్యదర్శిగా అండాలు, కోశాధికారిగా ఐలమ్మ, ఉపాధ్యక్షులుగా పద్మ, లక్ష్మమ్మ, నాగరాణి, సహాయ కార్యదర్శులుగా అండాలు, బారతమ్మలను నియమించారు. కార్యక్రమంలో సీఐటీయూ మున్సిపల్ కన్వీనర్ ఎల్లేశ్, బోడ యాదగిరిలు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలి

కేశంపేట: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఇంటింటికీ తీసుకెళ్లాలని స్థానిక సంస్థల మండల కన్వీనర్ కంచుకోట మహేశ్ అన్నారు. మండల పరిధి తొమ్మిదిరేకుల, పోమాల్‌పల్లి, దేవునిగుడితండాల్లో ఆదివారం గడప గడపకూ బీజేపీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ వైస్ ఎంపీపీ పసుల నర్సింహాయాదవ్‌తో కలిసి.. కేంద్రం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. బీజేపీ సర్కారు సహకారంతో రాష్ట్రంలో అమలు అవుతున్న పథకాల గురించి ప్రజలకు వివరించాలని సూచించారు. రైతులకు సబ్సిడీపై యూరియాను అందిస్తుందని, నిరుపేదలకు ఉచితంగా సన్నబియ్యం విషయాలను ప్రజలకు వివరించాలన్నారు. గ్రామాల్లో రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న ఇళ్లలో కూడా కేంద్ర ప్రభుత్వ వాటా ఉన్న విషయాన్ని లబ్ధిదారులకు, గ్రామస్తులకు తెలియజేయాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి తిరుపతి, ఉపాధ్యాక్షుడు నర్సింహులు, ఎస్టీ మోర్చా నాయకులు రాజు నాయక్, జెట్బూరి గోపాల్‌రెడ్డి, కుమారస్వామిగుప్తా, కృష్ణయాదవ్, శ్రీనివాస్‌గౌడ్, అకుల గోపాల్, చాకలి మహేందర్, లాలమోని యాదగిరి, శ్రీరాములునాయక్, మహేశ్, శివ, రాజు, చింటు పాల్గొన్నారు.

తెరుచుకున్న రేషన్ షాపులు

- రెండు నెలల విరామం అనంతరం నరుకుల పంపిణీ
- పెరిగిన కార్డులు, బియ్యం కోట
- మూడు మండలాలకు అదనంగా వంద టన్నులు
- దుకాణాలకు చేరిన సన్నాలు
- నేటి నుంచి సరఫరా



ఇబ్రహీంపట్నంలోని రేషన్ దుకాణానికి చేరుకున్న సన్న బియ్యం

ఇబ్రహీంపట్నం: రెండు నెలల విరామం అనంతరం రేషన్ దుకాణాలు తెరుచుకున్నాయి. మూడు నెలలు జూన్, జూలై, ఆగస్టు రేషన్ కోటాను జూన్ నెలలో ఒకేసారి పంపిణీ చేసిన సంగతి తెలిసిందే. దీంతో రేషన్ డీలర్లకు రెండు నెలల పాటు పూర్తి విరామం లభించినట్లయింది. సెప్టెంబర్ కోటా సన్న బియ్యం రేషన్ దుకాణాల్లోకి చేరుకున్నాయి. యూనిట్‌కు 6 కిలోల చొప్పున నేటి నుంచి సరఫరా చేయనున్నారు.

కొత్తవారికి పండగే

పుష్కర కాలంగా రేషన్ కార్డుల కోసం ఎదురు చూసిన అర్హులకు రాష్ట్ర ప్రభుత్వం ఆహార భద్రత కార్డులను ఇటీవల జారీ చేసింది. దీంతో వారు ఈ నెల నుంచి సన్న బియ్యం తీసుకోనున్నారు. ఉగాది పర్వదినాన కార్డు దారులకు దొడ్డు బియ్యానికి బదులు సన్నాల పంపిణీకి కాంగ్రెస్ ప్రభుత్వం శ్రీకారం చుట్టిన సంగతి తెలిసిందే. కేంద్ర ప్రభుత్వం ఒకే దఫా మూడు నెలల రేషన్ బియ్యం పంపిణీ చేయాలని నిర్ణయించడంతో రాష్ట్రంలోని రేవంత్ సర్కార్ అందుకు అనుగుణంగా జూన్‌లో మూడు నెలల బియ్యం పంపిణీ చేసింది.

కొత్తగా 4వేల కార్డులు

కొత్త కార్డుల మంజూరు, పేర్ల నమోదుతో బియ్యం కోటా పెరిగింది. ఇబ్రహీంపట్నం, యాచారం, మంచాల మండలాల్లో 45 వేలకు పైగా ఆహార భద్రత కార్డులు ఉండగా.. 89 దుకాణాల ద్వారా సుమారు 900 టన్నుల బియ్యాన్ని నెలనెలా స్థానిక గోడౌన్ నుంచి రేషన్ షాపులకు వెళ్లేది. కొత్తగా 4 వేల కార్డులు, పేర్ల నమోదుతో ఈ మూడు మండలాలకు ఈ సారి అదనంగా సుమారు 100 టన్నుల బియ్యం పంపిణీ చేయనున్నారు. ఈ మేరకు సన్న బియ్యం కోటా గోదాం చేరింది. ఇక్కడి నుంచి నిత్యవసరాల దుకాణాలకు తరలిస్తున్నారు. యూనిట్‌కు (ఆహార భద్రత కార్డులోని ఒక్కొక్కరికి) 6 కిలోల చొప్పున ఈ బియ్యం పంపిణీ చేయనున్నారు.

“ అదనంగా వంద టన్నులు



ఒకేసారి మూడు నెలల సన్నబియ్యం పంపిణీ అనంతరం.. రేషన్ దుకాణాలకు సెప్టెంబర్ కోటాను తరలించాము. కార్డులు పెరగడంతో ఈసారి సుమారు అదనంగా 100 టన్నుల బియ్యం వచ్చింది. నేటి నుంచి కొత్త, పాత కార్డు దారులకు బియ్యం పంపిణీ చేయనున్నాం.
– జ్యోతి, స్టాక్ పాయింట్ ఇన్‌చార్జి, ఇబ్రహీంపట్నం

చేసిన సేవలే గుర్తింపునిస్తాయి



హెడ్ కానిస్టేబుల్ తాటికొండ దశరథ దంపతులను సన్మానించిన ఏసీపీ తదితరులు

ఏసీపీ లక్ష్మీనారాయణ

కడ్తాల్: అంకితభావంతో విధులు నిర్వహించే ఉద్యోగులకు సమాజంలో గుర్తింపు, గౌరవం లభిస్తుందని షాద్‌నగర్ ఏసీపీ లక్ష్మీనారాయణ అన్నారు. స్థానిక ఠాణాలో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేసిన తాటికొండ దశరథ ఉద్యోగ విరమణ పొందాడు. ఈ సందర్భంగా ఆదివారం ఆ దంపతులకు పోలీస్ స్టేషన్‌లో సన్మానం చేశారు. అనంతరం ఏసీపీ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగులకు ఉద్యోగ విరమణ సహజమన్నారు. కానిస్టేబుల్‌గా దశరథ చేసిన సేవలు.. పోలీసు శాఖకు గర్వకారణమని కొనియాడారు. శేష జీవితం కుటుంబ సభ్యులతో ఆనందంగా గడపాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సీఐలు గంగాధర్, శివ ప్రసాద్, ఎస్ఐలు వరప్రసాద్, చంద్రశేఖర్, శ్రీశైలం, వెంకటేశ్, యాదయ్య, పద్మయ్య, ఏఎస్ఐ బాల్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు. కాగా.. ఉద్యోగ విరమణ పొందిన దశరథ్‌ను సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి, ఎంపీటీసీల ఫోరం జిల్లా మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీచ్యానాయక్, బీజేపీ మండల అధ్యక్షుడు మహేశ్ తదితరులు సన్మానించారు.

ఇన్‌స్ట్రక్టర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ఆమనగల్లు: ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం ఎంపిక చేసిన పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ తరగతులను ప్రారంభిస్తున్నామని ఎంఈఓ పాండు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిధి కోనాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో తరగతులు ప్రారంభించామన్నారు. ఈ తరగతులు బోధించేందుకు ఇన్‌స్ట్రక్టర్, ఆయా పోస్టులు మంజూరు అయ్యాయని తెలిపారు. వీటికోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని పేర్కొన్నారు. ఇన్‌స్ట్రక్టర్ పోస్టుకు ఇంటర్మీడియట్, ఆయాకు 7వ తరగతి చదివినవారు అర్హులని, 18 నుంచి 44 సంవత్సరాలు ఉండి, స్థానికులై ఉండాలన్నారు. ఈ నెల 6 ఆఖరు తేదని, ఔత్సాహికులు అర్హత పత్రాలతో ఎంఈఓ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు.



యాచారం: నందివనపర్తి గణపతి పూజలో మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ తదితరులు

ఘనంగా గణేశుడికి పూజలు

చవితి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా వాడవాడలా కొలువైన పార్వతీ పుత్రుడు వినాయకుడికి భక్తజనం ఐదో రోజు ఆదివారం భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. నైవేద్యంగా స్వామి వారికి ఫలాలు, పిండివంటలను సమర్పించారు. అనంతరం అన్నదానం చేశారు. ఈ సందర్భంగా భక్తిపాటలతో మండపాల పరిసరాలు మారుమోగాయి.



ఆమనగల్లు: సిద్ధి వినాయక కమిటీ ఆధ్వర్యంలో..



ఇబ్రహీంపట్నం: బృందావన్ నగర్‌లో.. పూజలు అందుకుంటున్న వినాయకుడు



ఆమనగల్లు: శక్తియూత్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం